క్లుప్తంగా

ప్రథమ చికిత్సపై అవగాహన



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రథమ చికిత్సపై వైద్యులు శుక్రవారం అవగాహన కల్పించారు. గుండె పోటు, ఇతర అత్యవసర సమయాల్లో సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీహెచ్‌వో డి.మోహనరావు, ఆరోగ్య శాఖ సిబ్బంది లక్ష్మీబాయి, రుక్మిణి, హైమావతి, శైలజ, నిర్మల, ఎన్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహు, అధ్యాపకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొండి బకాయిలు చెల్లించాలి



విలేకరులతో మాట్లాడుతున్న సీఈవో సుందరరావు

సారవకోట: పీఏసీఎస్ ద్వారా రైతులు తీసుకున్న బకాయిలు త్వరగా చెల్లించాలని, లేకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీఈవో సుందరరావు స్పష్టం చేశారు. ఈ మేరకు సారవకోట పీఏసీఎస్ చైర్మన్ సురవరపు తిరుపతిరావుతో విలేకరుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. పీఏసీఎస్ పరిధిలో 900 మంది రైతుల నుంచి రూ.4 కోట్ల బకాయిలున్నాయన్నారు. సకాలంలో చెల్లిస్తే 7 శాతం వడ్డీ ఉంటుందని, లేకుంటే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. పీఏసీఎస్ ద్వారా చిరు వ్యాపారులకు రుణాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గొర్రెలు, మేకలు, పశువులు కొనుగోలుకు రుణాలివ్వనున్నట్లు తెలిపారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సీఐ సన్యాసినాయుడు

పాతపట్నం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలని, దేశభక్తి భావాలు కలిగి ఉండాలని పాతపట్నం సీఐ ఎస్.సన్యాసినాయుడు సూచించారు. స్థానిక అమర జ్యోతి పాఠశాలలో స్కౌట్స్ గైడ్స్ కోర్సులో అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.సోమేశ్వరరావు, స్కౌట్స్ గైడ్స్ డివిజనల్ అధికారి ఎస్.నాగేంద్ర, మురళీకృష్ణ, జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ బృందం

సరుబుజ్జిలి: రైతులు సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యపడతాయని వ్యవసాయాధికారి కె.మన్మథరావు తెలిపారు. ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో భాగంగా విజయరాంపురం, షళంత్రి గ్రామాల్లో యాజమాన్య పద్ధతులు గురించి క్షేత్రస్థాయిలో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త చిట్టిబాబు, శ్రీకాకుళం మండల వ్యవసాయాధికారి రేణుకాసాయి, డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా విక్రయిస్తే చర్యలు

కొత్తూరు: ప్రభుత్వం నుంచి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ చింతాడ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. బాణసంచా అక్రమంగా నిల్వ ఉంచినా.. ఎక్కువ మోతాదులో రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. దీపావళి రోజు బాణసంచాలు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న పిల్లలకు బాణసంచాలు ఇవ్వకూడదన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలపై మాట్లాడుతున్న చందనరావు

పాతపట్నం: ఏపీ మోడల్ స్కూళ్లలోని రెగ్యులర్ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు డిమాండ్ చేశారు. పాతపట్నం ఏపీ మోడల్ స్కూల్‌ను చందనరావు శుక్రవారం సందర్శించి, ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వీస్ రూల్ అమలు చేయడం ద్వారా ఉద్యోగుల హక్కులు పరిరక్షించబడతాయన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రత్నకుమారి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.మోహనరావు, కార్యదర్శి డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

15 ఏళ్లుగా.. వేదన..!

- గ్రామానికి రోడ్డు లేక గిరిజనుల అవస్థలు
- ఎదురుచూపులే మిగులుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరుతున్న గిరిజనులు



కన్నయ్యపేట గ్రామానికి వెళ్లే మార్గం

సారవకోట: మండలంలోని మహాళింగి పంచాయతీ కన్నయ్యపేట గిరిజన గ్రామానికి రోడ్డు మార్గం లేక గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 ఏళ్ల క్రితం వీరు సీతంపేట పరిసర ప్రాంతాల నుంచి వలస వచ్చి ఇక్కడున్న కొండ ప్రాంతాల్లో పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ గ్రామంలో చిన్న పిల్లలతో పాటు 45 మంది గిరిజనులు నివసిస్తున్నారు. పంచాయతీ కేంద్రం మహాళింగి లేదా నారాయణపురం గ్రామాలకు వస్తే కానీ బయట ప్రపంచంతో వీరికి సంబంధం ఉండదు. మహాళింగి రావాలంటే సుమారు 3 కి.మీ పైబడి కొండ ప్రాంతం, పొలాల గట్లు మీద నుంచి నడుచుకుంటూ రావాలి. అదేవిధంగా నారాయణపురం చేరాలన్నా 2.5 కి.మీ కొండల నుంచి నడుచుకుంటూ రావాల్సి వస్తుంది. కన్నయ్యపేటకు చెందిన గిరిజన విద్యార్థులు నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో చదువుకునే వారు. అయితే విద్యార్థులు వచ్చే మార్గంలో జీరాయితీ భూములుండడంతో యజమానులు ఆ మార్గాన్ని నిలిపివేశారు. దీంతో అక్కడ నుంచి విద్యార్థులు నారాయణపురం పాఠశాలకు రాలేక చదువు మానేయాల్సి వస్తోంది. వీరు వలస వచ్చిన తర్వాత ఆధార్, రేషన్ కార్డులు, గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ సరఫరా, బోరు, ట్యాంకు ఏర్పాటు చేసి తాగునీరు సరఫరా చేయడం జరిగింది. అయితే రోడ్డుమార్గం లేకపోవడంతో అత్యవసర సమయంలో.. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు గట్లు, పుట్టలు, కొండ ప్రాంతాల నుంచి మంచాలతో మోసుకొని రావాల్సి వస్తోందని వాపోతున్నారు. దీనిపై పలుమార్లు మండల, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా రహదారి నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పాఠశాలకు వెళ్లలేకపోతున్నారు



నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో మా పిల్లలను చేర్పించాం. అయితే సరైన రోడ్డు మార్గం లేకపోవడంతో పాఠశాలకు ఒకరోజు వెళ్తే.. మరోరోజు వెళ్లే పరిస్థితి లేకుండా పోతోంది. వారి చదువులు అంతంతమాత్రంగా సాగుతున్నాయి.

– ఎస్.దినేష్, కన్నయ్యపేట, సారవకోట మండలం

మంచాలపై మోసుకెళ్తున్నాం



గ్రామంలో ఎవరికైనా అనారోగ్యం సంభవించినప్పుడు, ప్రసవ సమయంలో ఆస్పత్రికి తరలించాలంటే అవస్థలు పడాల్సి వస్తోంది. వాహనాలు గ్రామంలోకి వచ్చేమార్గం లేకపోవడంతో మంచాలపై మోసుకెళ్తున్నాం. రోడ్డు వేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కన్పించడం లేదు. చివరికి ఎస్టీ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేశాం.

– ఎస్.జోసెఫ్, కన్నయ్యపేట, సారవకోట మండలం

ఉద్యోగులు రాజకీయాలు చేయొద్దు

- రాజీనామా చేసి వస్తే స్వాగతిస్తాం
- పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్య



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

పోలాకి: మండలంలో కొందరు ఉద్యోగులు క్షేత్రస్థాయిలో ఏళ్ల తరబడి పాతుకుపోయి రాజకీయాలు చేస్తున్నారని, అలాంటివారి వలన పారదర్శకంగా ఉద్యోగం చేస్తున్న వారికి సైతం నిందలు తప్పడం లేదని జెడ్పీటీసీ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జోనల్ ఇన్‌చార్జి ధర్మాన కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని ఈదులవలస, కుసమపోలవలస పంచాయతీల కమిటీ సభ్యులతో మండల పరిషత్ సలహాదారు ముద్దాడ భైరాగినాయుడు అధ్యక్షతన రచ్చబండ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈదులవలస చుట్టుపక్కల గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది చేస్తున్న రాజకీయాలు చూస్తున్నామని, ప్రతీ చర్యకు ప్రతిచర్య ఉంటుందని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎలాంటి ఆవేశాలకు తావివ్వకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. జగన్ 2.0లో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని చెప్పారు. అనంతరం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు, చింతు రామకృష్ణ, ముద్దాడ మురళీనాయుడు, కలగదండు తాతారావు, రావాడ అప్పన్నరాజు, బోర రామారావు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట: కూటమి పాలనలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు డిజిటల్ బుక్‌లో వివరాలు నమోదు చేయాలని ధర్మాన కృష్ణచైతన్య సూచించారు. మండలంలోని దూకులపాడులో రచ్చబండ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు శ్యామ్ ప్రసాద రెడ్డి, ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావు, దూకులపాడు, గొట్టిపల్లి సర్పంచ్‌లు అల్లు అసిరినాయుడు, అవ్వ రవీంద్రనాథ్, నాయకులు రాజాపు అప్పన్న, లుకలాపు రవి, బగ్గు రమణయ్య, పతివాడ గిరీశ్వరారావు, బొబ్బాది ఈశ్వరరావు, బుద్దల రాజశేఖర్, పాగోటి భరత్, కనపల శేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎం స్వానిధి పథకంపై అవగాహన



మాట్లాడుతున్న కమిషనర్ తమ్మినేని రవి

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రధానమంత్రి స్వానిధి పథకంపై స్వయం సహాయక సంఘాల మహిళలు, వీధి వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ తమ్మినేని రవి అధ్యక్షతన శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి స్వానిధి పథకం ద్వారా వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి రుణ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. రుణ చెల్లింపులను సమయానికి జరపడం ద్వారా వడ్డీ సబ్సిడీ మరియు క్రెడిట్ లిమిట్ పెంపు వంటి ప్రయోజనాలను పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ నరేష్ కుమార్, మెప్మా టీఎంసీ ఎస్.వి.రత్నం, సీవో నాగమణి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

పాతపట్నం: మండలంలోని గంగువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పదో తరగతి ఫలితాల్లో బడియా చంద్రమౌళి అత్యధిక మార్కులు సాధించాడు. దీంతో పాఠశాలలో రామరాజు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థి, తండ్రి చంద్రారావు, హెచ్ఎం పీఆర్ వల్లభరావును శుక్రవారం సన్మానించారు. అలాగే రూ.1,000ల ప్రోత్సాహక బహుమతి అందజేశారు. వెయ్యి రూపాయలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పి.రామరాజు, ఎస్.గంగాధరరావు, ఉపాధ్యాయులు ఎం.షణ్ముఖరావు, వై.ప్రమీల కుమారి, దైవకటాక్షం, నీలవేణి, మహాలక్ష్మి, సుందరమ్మ, అప్పల సరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పార్వతీ పరమేశ్వరుల తిరువీధి నిర్వహిస్తున్న దృశ్యం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో వెలిసిన మధుకేశ్వరునికి ఆశ్వయుజ మాసం బహుళ ఏకాదశి పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం తిరువీధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామివారికి ఏకవార అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేపట్టారు. పార్వతి పరమేశ్వరుల ఉత్సవమూర్తులను చక్కగా అలంకరించి పల్లకీలో ఆశీనులుగా చేశారు. అనంతరం మంగళ వాయిద్యాలు నడుమ తిరువీధి నిర్వహించగా భక్తులు హారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలకు తాత్కాలిక వైద్యులు

బూర్జ: పీహెచ్‌సీ వైద్యులు, సీహెచ్‌సీ వైద్యులు సమ్మె బాట పట్టడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్యాధికారులు శుక్రవారం నుంచి ప్రభుత్వ రిమ్స్‌లో పీజీ చేస్తున్న వైద్య విద్యార్థులను విధుల్లో నియమించారు. బూర్జ పీహెచ్‌సీకి డాక్టర్ కె.సత్య వెంకటేష్‌బాబు, గుత్తావల్లి పీహెచ్‌సీకి డాక్టర్ బమ్మిడి చక్రధర్‌ను కేటాయించారు. పూర్తిస్థాయి వైద్యులు 12 రోజులుగా విజయవాడలోని ధర్నా చౌక్‌లో రిలే దీక్షలు చేస్తుండడంతో.. తాత్కాలిక వైద్యుల నియామకాలు చేపట్టారు. వీరు సమ్మె విరమించిన వరకు కొనసాగుతారన్నారు.

అధ్వానంగా రహదారులు



సుభద్రాపురం సమీపంలో తవ్వేసిన పీఎంజీఎస్‌వై రహదారి

- వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



గోతులమయంగా బుడ్డివలస రహదారి

సరుబుజ్జిలి: మండలంలోని ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారుల్లో గుంతలు ఏర్పడడంతో వర్షాలకు నీరునిల్వ అవుతోంది. ఫలితంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని వాహనదారులు వాపోతున్నారు. వాస్తవానికి రహదారుల మరమ్మతులకు గ్యారెంటీ కాలం ఉన్నప్పటికీ.. కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదు. దీనివలన 108, 104 వాహనాలు కూడా గ్రామాల్లోకి రావడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అలికాం–బత్తిలి రహదారి నుంచి తమ్మినాయుడుపేట అక్కడ నుంచి దకరవలస వరకు ఉన్నటువంటి పీఎంజీఎస్‌వై రహదారిలో హై లెవెల్ కాలువ పనులు కోసం తవ్వకాలు చేపట్టారు. కాలువ పనులు పూర్తికాకపోగా.. రహదారిని కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. అలాగే తెలికిపెంట రహదారిలో బుడ్డివలస రహదారి మొత్తం పెద్దపెద్ద గోతులు ఏర్పడి నడవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారుల మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి



రొట్టవలస ప్రధాన రహదారులతో పాటు, చిన్న చిన్న రహదారుల పరిస్థితి కూడా దారుణంగా ఉంది. సుభద్రాపురం సమీపంలో కాలువ పనుల కోసం రహదారి తవ్వకాలు చేపట్టి బాగు చేయలేదు. మరమ్మతులు సక్రమంగా చేయక రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి. వర్షంపడితే మురికి గుంతల్లా దర్శనమిస్తున్నాయి.

– మూడడ్ల రమణ, రొట్టవలస, సరుబుజ్జిలి

సగంలో నిలిపివేశారు



బుడ్డివలస గ్రామానికి నిర్మించిన అంతర్ రహదారి సగంలో నిలిపేశారు. దీనివలన వర్షం వస్తే నడవలేని పరిస్థితులు ఉన్నాయి. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ వాహనం వచ్చేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు స్పందించి మరమ్మత్తులు చేయాలి.

– మునకాల సూర్యారావు, సరుబుజ్జిలి

ప్రైవేటీకరణను అడ్డుకోవాలి



పాత ఆమదాలవలసలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్న దృశ్యం

ఆమదాలవలస: కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలని చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి ఒకటో వార్డు తిమ్మాపురం, 19వ వార్డు పాత ఆమదాలవలస గ్రామాల్లో శుక్రవారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, ముఖ్య నాయకులు సంపతిరావు రామారావు, పాదిలాపు తిరుపతిరావు, పొడుగు శ్రీనివాసరావు, దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, కూన రామకృష్ణ, మామిడి రమేష్, బండి హేమ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెట్టడం సరికాదు



నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

కొత్తూరు: ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న సాక్షి పత్రిక, పత్రిక ఎడిటర్ ధనంజయ రెడ్డిపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టడం సరికాదని మండలానికి చెందిన జర్నలిస్టులు మండిపడ్డారు. ఈ మేరకు మండలం కేంద్రంలోని నాలుగు రోడ్లు కూడలి వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు.

అనంతరం తహసీల్దార్ కె.బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. పత్రికా స్వేచ్ఛను అణిచివేయాలని చూడడం సరికాదన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలు ప్రతికలకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు.

104 వాహనం తనిఖీ

హిరమండలం: మండలంలో వైద్య సేవలు అందిస్తున్న 104 వాహనాన్ని డివిజనల్ అధికారి దినేష్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. వాహన నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. వాహనం ద్వారా అందించిన సేవలు గురించి ఆరా తీశారు.

అనంతరం ఎల్ఎన్‌పేట మండలం వాడవలస గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో హరి, పైలెట్ నర్సింగరావు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో..!

- నీలమణి దుర్గ ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు





ఆలయంలోని మానిటర్‌లో సీసీ కెమెరాల పనితీరు



ఆలయంలో సీసీ కెమెరా

పాతపట్నం: నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఉత్కళాంధ్ర ఆరాధ్య దైవం నీలమణిదుర్గ ఆలయ పరిసరాల్లో నేరాలు, చోరీలకు సీసీ కెమెరాలతో చెక్ పెట్టారు. దీనివలన అనుమానాస్పద వ్యక్తుల సంచారం, పిక్ ప్యాకెటింగ్, చైన్ స్నాచింగ్‌లు, బ్యాగులు, ఇతర వస్తువుల అపహరణ, ఎక్కువ మంది భక్తులు ఎక్కడ ఉన్నారు, గర్భగుడిలో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలుసుకునే వెసులుబాటు వచ్చింది. అలాగే భక్తులపై దుకాణాదారులు ఎలా వ్యవహరిస్తున్నారో తెలుసుకోవచ్చు. ఆలయం చుట్టూ రహదారులు కనబడేవిధంగా కెమెరాలతో నిఘా వ్యవస్థ ఏర్పాటుకు ఆలయ ఈవో టి.వాసుదేవరావు, చైర్మన్ అక్కందర సన్యాసిరావులు చర్యలు తీసుకున్నారు.

భక్తుల భద్రతే లక్ష్యంగా...

నీలమణిదుర్గ ఆలయానికి ఆంధ్రా – ఒడిశా రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ భక్తులు వస్తుంటారు. దీంతో పాటు మంగళవారం, ఆదివారం ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందువలన వీరిలో భక్తులు, యాత్రికులు, ప్రయాణికులు, యాచకులు, నేరాలకు పాల్పడే వారెవరో గుర్తుపట్టడానికి నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశారు. దీనికోసం ఆలయం నాలుమూలల ఇప్పటికే 8 హెచ్‌డీ సీసీ కెమెరాలను అమర్చారు. మరో 8 కెమెరాలను ఏర్పాటు చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఆలయ గర్భగుడి, ఆలయానికి వచ్చే గేటు ఎదురుగా, ముఖ ద్వారం వద్ద, గంటస్తంభం వద్ద, ఆలయం అమ్మవారి విగ్రహం కొబ్బరికాయలు కొట్టే హాల్ వద్ద సీసీ కెమెరాలతో పాటు చిన్న మానిటర్‌ను అమర్చారు. అదేవిధంగా పాతపట్నం–శ్రీకాకుళం రహదారి, తెంబురు రహదారులు కనిపించే విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆలయ కార్యాలయంలోని మానిటర్‌లో ఎనిమిది కెమెరాల పనితీరును పరిశీలించవచ్చు.

నేరస్తుల గుర్తింపు సులభం

సీసీ కెమెరాల ఏర్పాటుతో గతంలో ఒక వ్యక్తి బూరగాంలో ఒక వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొని వెళ్లిపోయాడు. ఆ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాల సాయంతో నిందితుడిని గుర్తించి పట్టుకున్నారు. సెల్‌ఫోన్ దొంగతనం చేసిన వారిని, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి వెంటనే పోలీసులకు తెలియజేసి, సిబ్బందిని అలర్ట్ చేసి పట్టుకోవడం సీసీ కెమెరాల ద్వారానే సాధ్యమవుతుంది.

అప్రమత్తం చేయవచ్చు



ఒడిశా – ఆంధ్రాతో పాటు పలు రాష్ట్రాల నుంచి అమ్మవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రత కల్పించేందుకే సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశాం. నేరాల నియంత్రణ, రద్దీలను కెమెరాల ద్వారా గుర్తించి సిబ్బందిని అప్రమత్తం చేయవచ్చును.

– టి.వాసుదేవరావు, ఆలయ ఈవో, పాతపట్నం